# బిడ్డ

సాయంత్రం భోజనమై కూర్చున్నప్పుడు ఆ ప్రాంతంలో జరిగిన శిశు హత్య విషయం ప్రస్తావనలోకి వచ్చింది. శీతయ్యగారు అన్నారు కదా - "ఇల్లాంటి పనులు యెట్లా జరుగుతాయో తెలీదు. కసాయివాడి నౌకరు ఆ పిల్లని పాడు చేశాడూ? ఆ పిల్ల బిడ్డని కని కుడితి తొట్టిలో పారేసింది! ఆ పిల్లని బాగా చంపనన్నా చంపలేదుట కాదూ?"

మాతో భోజనం చేసిన డాక్టరు రామచంద్రరావు ఆ హత్యలోని భయోత్పాతమైన తప్సీళ్ళన్నీ చెప్పాడు. ఆయనకి ఆశ్చర్యం కలిగించిందేమంటే - వొంటరిగా యే సహాయమూ లేకుండా పిల్లని కని, దాన్ని చంపడానికని, కన్న వెంటనే రెండు మైళ్ళు నడచిన ఆ ఆడదానికి యెంత ధైర్యమో, యెంత శక్తో అని ఆశ్చర్యపడ్డాడు. "ఎంత పట్టుదల అండీ! ఆ యేడ్చే పిల్లని చేతుల్లో పట్టుకుని (ఇంకా తడిగా ఉన్న ఆ పిల్లని) అర్ధరాత్రి ఆ చిట్టడివిలో నడిచి వెళ్ళిందంటే, యెంత పైశాచిక దేహబలం కావాలో ఆలోచించుకోండి. సాధారణంగా శరీరంలో అంత బలాన్ని కల్పించిన నైతిక వేదనని తలుచుకుంటే నా గుండె దడదడలాడుతోంది. ఆమె ఆత్మ ఎంత భయంతో వణికిందో, ఆమె హృదయం ఎంత దారుణమైనదో, అసహ్యకరమైనదో, నీచమైనదో, ఆ పిల్ల చేసిన క్రూరకృత్యంకన్నా, అతి దారుణమూ, నీచమూ, క్షమింపరానివీ అయిన పవిత్రాభిప్రాయాలు - ఆ పిల్లకన్న తాము అధికులమనీ, మర్యాదస్తులమనీ, ఖండించి ఆ పిల్లచేత అట్లాంటి పనులు చేయించిన ప్రజల క్రూరత్వం! ఈ ఆడపిల్లల్ని లొంగదీసి, వాళ్ళ చేత వాళ్ళ కోర్కెల్ని అనుభవించమని బలవంతం చేసే, యీ జీవిత శక్తికి పర్యవసానంగా పాపం, హత్యలూ, శిశు హత్యలూ, భ్రూణహత్యలూ, బలవంతంగా చేయించేదెవరు? అసహజమైన నైతికాభిప్రాయాలూ, యేహ్యమైన మర్యాదలూ, బూజుపట్టి కుళ్ళి, కులకులలాడే పాతివ్రత్య నియమాలూ - వీటిలో - మురుగులో, ఆ కుళ్ళులోనే పురుగుల్లాగా ఆనందంగా బతికే ఈ సంసార స్త్రీలు - వీళ్ళూ ఈ దారుణ కృత్యాలకి కారణం. వాళ్ళని శిక్షించాలి యీ ప్రభుత్వంవారు. ఇటువంటి నీతి చట్టాల్ని స్థాపించి, సహజమైన స్త్రీ పురుష సంయోగాన్ని శిక్షార్హం చేసిన యీ సంఘం ఎంత అవమానపడాలి తనని చూసి తాను!"

ఆ మాట విని శీతాయమ్మగారు మండిపడ్డది. "చాలా బావుంది! పతివ్రత కన్నా వెలయాలు పుణ్యాత్మురాలనేనా మీ వాదన! తన అంతరాత్మ బోధన ప్రకారం ధర్మమే తన దైవంగా, పతిని కొలిచే పుణ్యస్త్రీకన్నా, తన మనసు యెటు లాగితే అట్లా తన దేహవాంఛలకి లోబడి, సౌఖ్యాలు అనుభవించే సిగ్గూ, అభిమానమూ, విడిచి వ్యవహరించే స్త్రీ అత్యుత్తమురాలా? బాగా ఉన్నాయి మీ మాటలు!"

తాను స్వయంగా చూసిన అనేక ఘోరాలవల్ల డాక్టరు హృదయం గాయపడి వుంది. ఆయన లేచి చాలా పట్టుదలగా మాట్లాడాడు.

"అమ్మా! మీకేమీ తెలియని విషయాన్ని గురించి మీరు చాలా తెలిసినట్టు మాట్లాడు తున్నారు. పెద్దలు చెప్పినవీ, పుస్తకాల్లో చదివినవీ ఆ ధర్మాలు ఏకరువు పెట్టారు గానీ, వాస్తవమైన లోకం చూసి కాదు. ఏ నిగ్రహానికీ లొంగని తీవ్రమైన కోర్కెల్ని మీరెరుగరు. మీకేమి అర్థమవుతుంది. యితరుల సంగతి? నేను కళ్ళారా చూసిన ఒక జీవిత చరిత్రను చెబుతాను వినండి. మీకు అర్థంకావు ఈ విషయాలు. అర్థం చేసుకోరు. చేసుకోవడంలో మీ ఆచారానికి, మీ క్షేమానికి, ఘనతకి విరుద్ధం. ప్రయత్నించి దయతో, సహనంతో, జాలితో సానుభూతి చూపితేనేగాని, అటువంటి నిర్భాగ్యుల అవస్థలు అర్థం కావు. అతి బలీయమైన కోర్కెలతో చీల్చుకుపోతాయి. యీ పతితుల హృదయాలు. సౌమ్యమూ, జీవరహితమూ, అల్పమూ, నిర్మలమూ, అయిన శక్తులు గల యీ పుణ్యాత్ములకు చాలా సులభం నీతి మార్గాన సంచరించడం. వారు పోరాడి జయించవలసిన గొప్ప శత్రువులు లేవు వారిస్వభావాలలో,

శీతల రక్త ప్రవాహం కలిగిన ఈ సాధారణ సంసార స్త్రీలు, నీతి విషయంలో చాలా కఠినులు. వారి మెదడు చాలా హీనస్థితిలో వుంది. వారు చూపే ప్రేమా అంతే. కొద్దిమంది మీద కొద్దిగా చూపుతారు. వారివంటి మర్యాదస్తులకే తృప్తినిస్తుంది అది. జారిపడిపోయిన స్త్రీలను చూసి, క్రౌర్యం చూపుతారు. తమకు సాధ్యంకాని మోహాన్ని వాళ్ళు అందుకోగలిగారనే ఈర్ష్య కావచ్చును. ఈ పతితులకు మర్యాద అన్నా, నీతి అన్నా చాలా గౌరవమే. కాని వారి హృదయ శక్తులు ఆ గౌరవాన్ని అణగ తొక్కేటంత ఉ ధృతము కలవి. ఈ సంసార స్త్రీలు శాంతంగా నిద్రపోగలరు. రాత్రులు సాధారణ అలవాట్లతో తృప్తిపడి, వారికేమీ భయంకరమైన కలలు రావు. సాహసకృత్యాలను చేయించే దారుణ కృత్యాలు వారికి నిద్రాభంగం కలిగించవు. ఎవరో ఒక భర్త మంత్రాలతో పవిత్రమైన హక్కు కలిగినవాడు. ఆమెతో పడుకోవచ్చని లోకం అంగీకరించిన మనిషి వుంటే చాలు. అప్పుడప్పుడు యేదో అప్రయత్నంగా కోర్కెలు స్వల్పంగా బాధిస్తాయి. ఎందుకంటే, ఎంత పవిత్రులైనా మీరు మనుషులేగా! కాని ఆ కోర్కెలు అప్పుడే అణగిపోతాయి. నగలలో, పట్టు చీరెలలో, పెళ్ళి సంబంధాల ప్రయత్నాలతో, కొందరు కోర్కెలకు లోబడినా, చాలా వివేకంతో, రహస్యంగా జారి, మళ్ళీ కాళ్ళు కుదుటపరుచుకుని, మరింత తీవ్రంగా నీతి చర్చలు చేసి, గుంపుని కలుసుకుంటారు. ఏ పాపం చేసినా మనసులోనేగాని, శరీరాన్నేమీ అంటదు. ఏ పాపం చేసినా గదుల్లోనే కాని, లోకానికి కంటపడదు. కామోద్రేకులై పుట్టిన వాళ్ళ శరీరాలు వాళ్ళ స్వాధీనంలో వుండవు. ఇంద్రియాలు విచ్చలవిడిగా ఈడుస్తాయి. వాటిని అరికట్టటం వారి స్వాధీనం కాదు. అట్లాంటి కోర్కెలే మీకు వుంటే మీ యింద్రియాలు మీ స్వాధీనం కావు. వాయువుల్ని కానీ సముద్రాన్ని కానీ అడ్డుపెట్టగలరా? ఏ కామమూ తన స్వభావంలో లేకుండా, యే సౌఖ్యమూ ఇతరులకి యివ్వలేని స్త్రీలు. ఏ కల్మషమూలేని స్త్రీలు, శుద్ధవ్యర్థులు, వాళ్ళు నీతి మార్గంలో వున్నారంటే, అది వాళ్ళకేమీ ఘనత కాదు. మెసలినాలను రష్యా క్యాతరిన్లనూ నీతిపథంలో చరించమంటే వాళ్ళతరమా? అద్భుతమైన

ఆలింగనాలకై అవతారమెత్తినవాళ్ళు! వాళ్ళ శరీరాలు రక్తమే. అంగాలే వేరేవిధంగా నిర్మింపబడతాయి. చప్పున ఎక్కువగా ఉద్రేకపడగలవి. ఒక ఆశగాని, ఒక అభిప్రాయంగాని యితరుల సమీపత్వంగాని, వారి భావాల్ని భగ్గుమనిపించేస్తాయి. వారి నరాలు తిరగబడి, వారిని వేటాడి కదిలించి, లోబరుచుకుని ఆడించేస్తాయి. చిలకలకు పెట్టే గింజల్ని పెట్టి డేగల్ని బతికించగలమా?

రక్తమూ ఇంద్రియాలూ చూపే శక్తిని మీ బోటివారు అర్థం చేసుకోగలరా? రాత్రులకు రాత్రులు ఎడతెరిపి లేక, అన్ని ఝాములూ, చీల్చి చీల్చి, బాధపెట్టి వొంటినంతా మండించి, గుండెకు విరామమివ్వకుండా పిండి పిండి ఎంత తోసేసినా పోనీ రూపాలనీ, ఆశల్ని కళ్ళముందు కనపరచి, పిచ్చెక్కిస్తాయి - వారి అనుభవము అంత ఉన్నతి కలదే. మీకేం అర్థం కాగలదు వారి ఆనందం. వారి కామోద్రేకంలో అపారసుఖం? కథ వినండి.

శశి అనే పిల్ల అదురదృష్టవంతురాలు. ఉధృతమైన రక్తంతో పుట్టింది. నడక నేర్చుకునేప్పుడే ఆమెలో అనేక గుణాలు మొలకెత్తాయి. మీరు ఏమంటారంటే అసహజమైన నీరస అల్ప జీవనులంటారనుకోండి. నా అభిప్రాయమే న్యాయమైనది. ఈ నీతి ప్రజలందరూ రక్తంలేక, శక్తిలేక ఎండిపోయే పీనుగలు, పెద్ద కండలు పెంచిన మనిషి వొచ్చి, మనుషులందరూ సహజంగా అంత బలంగానూ వుండాలని బోధిస్తూ వుంటే, మనమేమైనా ఆశ్చర్యపడుతున్నామా? అట్లానే ఎవరైనా వేడిరక్తం తీవ్రవాంఛలూ కలిగి వుండడమే సహజమని బోధిస్తే మనం తిట్టడమెందుకు?

ఆ పిల్లకి పదేళ్ళప్పుడు ఆమెని నా దగ్గరికి పరీక్షకోసం తీసుకొచ్చారు. అప్పటికే సంపూర్ణంగా అన్ని అవయవాలు ఎదిగాయి. కామోద్రేకం చేత బాధపడుతోంది. పూర్తిగా వికసించిన పువ్వులవంటి బలువైన పెదిమలు, బాగా బలిసిన కంఠం, వెచ్చనివొళ్ళు, పెద్దముక్కు బాగా తెరుచుకున్న ముక్కురంధ్రాలు, కళ్ళు పైకెత్తితేచాలు మొగవాళ్ళని వుడుకెత్తించే చూపులు, అట్లాంటి ఆ ఉద్రేకంగల మృగాన్ని యెట్లా తృప్తిపరచడం? ఏ కారణమూ లేకుండానే రాత్రంతా ఏడ్చేది పాపం! ఆ పిల్లకే తెలీదు తన బాధ యేమిటో, ఎందుకో.

నా సలహా మీద ఆ పిల్లకి పెళ్ళి చేశారు. రెండేళ్ళలో క్షయరోగంతో ఆ భర్త చచ్చిపోయాడు. ఆమె అతని సత్తువనంతా లాగేసింది. రెండో పెనిమిటి పద్దెనిమిది నెలలలో పోయినాడు. మూడోవాడు నాలుగేళ్ళు కాపురంచేసి అంతులేకుండా పలాయనమైనాడు. ఇంక పెళ్ళి వీలులేదు. వొంటరినైపోయి శశి ఎట్లాగో మర్యాదగా బతకాలని చాల ప్రయత్నించింది. ఆమెకి నీతి మీద చాలామంది పతివ్రతలకన్నా ఎక్కువ అభిమానం. తక్కిన మనుషుల మల్లేనే, సంతోషంగా, నెమ్మదిగా, స్నేహంగా బతకాలనే ఆమె ఆశగూడా.

ఒకరోజు ఆమెకి నరాల "కన్వల్షన్" రోగం కలిగి భయమేసి నాకు కబురంపింది.

నేనామెను పరీక్షచేసి, మొగాడి సంపర్కం లేకపోవడం కారణమని తెలుసుకున్నాను. అలా ఒంటరిగా ఉంటే చచ్చిపోతావని ఆమెతో చెప్పేశాను. ఆమె మర్యాదస్తురాలు. నలుగురిలో తిరిగి బతకవలసిన మనిషి. అందుకని నేను చెప్పిన విషయం లక్ష్యం చెయ్యక తోసుకు తిరగాలని చూసింది. కాని సాధ్యం కాలేదు. ఏం చేస్తుంది? అదేదో విపరీత జాడ్యమని తన కోర్కెతో యుద్ధం సాగించింది.

శరీరాన్ని అలవకొట్టి శాంతింప చెయ్యడానికి రాత్రులంతా, రోడ్ల వెంబడి పరుగెత్తుతోంది. వొళ్ళంతా శూలాలవలె పొడుస్తోవుంటే, మూర్ఛ పడిపోయేది. వూరంతా ఆమెకి పిచ్చి పట్టిందనీ, దెయ్యం పట్టిందనీ అనుకుంటున్నారు. నేను మామూలు మందులన్నీ ఆమె యెడ వృధాకాగా, అసహాయుణ్ణై దిగులుపడి చూస్తో కూచునేవాణ్ణి. సృష్టి పట్టుదలకూ, ఆమె మనో నిశ్చయానికీ మధ్య నలిగి ఆమె శరీరం యమబాధపడుతోంది.

ఒకరాత్రి నేను భోజనం చేసి వొస్తోండగా, మా యింటికి వొచ్చింది ఆమె.

"నా పని అయిపోయింది. ఇంక నాకు గతిలేదు. కడుపుతో ఉన్నాను.

"ఏమిటి?"

"కడుపుతో ఉన్నాను"

"మీరు."

"అవును, నా తోటవాడు, డాక్టరుగారూ! వాడు.... నేను తోటలో నడుస్తూ మూర్ఛ పడ్డాను. నేను కింద పడుతో వుండగా, వాడు చూసి, పాపం, పరిగెత్తుకొచ్చి పట్టుకొని పడుకోబెట్టడానికి యింటిలోకి తీసుకుపోతున్నాడు. నాకెందుకు పుట్టిందో ఆ బుద్ధి ఎట్లా కలిగిందో ఆకోర్కె! నేను కాదులెండి నాకు తెలీయకుండానే ఆ నా చేతులు స్వాధీనం తప్పి, వాణ్ణి కావలించుకున్నాయి. మీకు తెలుసుగా నా జాడ్యం. నేను పాపం చేశాను. మా యిద్దరికీ సంబంధం ఏర్పడ్డది. మానుకుందామంటే నా చేత కాలేదు. ఇట్లా అయింది నా గతి. ఈ కడుపు తీసేసుకోవాలని ప్రయత్నించాను. మసిలే నీళ్ళతో స్నానాలు చేశాను. మందులు తిన్నాను. కానీ లాభమేమీ లేకపోయింది. నా తల్లిదండ్రులకి ఈ సంగతి తెలిస్తే నన్ను ముక్కలు ముక్కలు కింద చెక్కుతారు. అయిపోయింది నా పని. నా చెల్లెలు మొగుడు ఏమంటాడు. అక్క ఇట్లాంటిదని దాన్నేమి చేస్తాడో ఏమో! నా స్నేహితులు, బంధువులు, మా అమ్మ ఎట్లా తలెత్తుకుంటారు?"

నేనామెను ఏదన్నా దూరదేశానికి వెళ్ళి కానుపు చేసుకోమని సలహా ఇచ్చాను. తరువాత నేను వెళ్ళి చాలాసార్లు ఆమెను చూశాను. ఆమెకి మతిపోయింది. తన లోపల పెరిగే పిల్లని తలుచుకుని బాధపడుతోంది. పగలు ఎవరికీ కనపడదు. ఈ రహస్యం బైట పడుతుందని. ప్రతిరాత్రీ బట్టలన్నీ తీసేసి, అద్దం ముందు నుంచుని పరీక్షించుకుంటుంది. కటిక నేలమీద పడి ఏడుస్తుంది. రాత్రికి ఇరవైసార్లన్నా దీపం వెలిగించి అద్దంలో తనని

తాను చూసుకుంటుంది. పొట్టలో పిండాన్ని ముక్కలు చెయ్యాలని గుప్పెట్లతో పొట్టని బాదుకుంటుంది. కాని అది అట్లానే వుంది. ఆ పిండానికీ ఆమెకి పెద్ద యుద్ధం కలగడం ప్రారంభించింది. ఆమెని తప్పించుకోవడానికి అటూ ఇటూ తప్పించుకుని జరుగుతుంది. డాక్టరుకి తెలుసు, పిండం కూడా తన ప్రాణ రక్షణకోసం యెంత తంటాలు పడుతుందో. ఆమె తన బలుపంతా పొట్టమీద ఆనించి కటిక నేల మీద బలంగా దొర్లుతుంది. పొట్టమీద అఖండమైన బరువులు పెట్టుకుని నిద్రపోతుంది. తన ప్రాణాల్ని హరింపగల శత్రువుని ద్వేషించినట్టు ద్వేషించింది. తన పిల్లని. ఒకరోజు ఆమె తల్లి "ఏమిటే శశీ, మరీ యింత లావవుతున్నావు?" నీ పెనిమిటి వుంటే ఈ పాటికి కడుపుతో ఉన్నావనుకొందును" అంది. తన కూతురు యిట్లాంటి పని చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. దాంతో శశికి పూర్తిగా పిచ్చెక్కింది. గదిలోకి పోయి పొట్టని బాదుకుంది. చికత కొట్టింది. బల్లల మూలకేసి అదుముకుంది. చివరికి పనసకత్తి ఒకటి తెచ్చింది. దీపం వెలిగించింది. అద్దం ముందు పెట్టింది. ఆ లోపలి పిల్లమీద ద్వేషంతో ఒళ్ళు దహించుకుపోతోంది. ఎక్కడి పిశాచి అని తనను తను వదలలేదు. దాన్ని పైకి తీసి చేతుల్లో పట్టుకుని, గొంతు నలిపి, ఇప్పుడేం చేస్తావు? అని దూరంగా పారెయ్యాలి. కత్తి తీసి పొట్ట మీద ఒక్క పోటు పొడిచి, పొట్టను చీల్చుకుంది.

చాలా సూటిగా నేర్పుగా పనిచేసింది. చప్పున దాంట్లో వేలు దూర్చి ఒక కాలు బైటికి లాగెయ్యాలని చూసింది. కానీ, ఆమెకీ పిల్లకీ ఎడతెగని బంధాలు పెట్టింది టక్కరి సృష్టి. వాటిని కోసుకోలేక వాటిని కూడా లాగెయ్యాలని ప్రయత్నించి సాధ్యమయ్యే లోపలే శశి చచ్చి కిందపడిపోయింది, పెద్ద రక్తపు మడుగులో.

"ఆమె ఏం నేరం చేసిందంటారు" అని అడిగి వూరుకున్నాడు డాక్టర్.

సీతాయమ్మగారు ఏమీ మాట్లాడలేదు.

(శ్రీ ముపాసా కథకు అనువాదం పేర్లు మాత్రం మార్చి తెలుగులో వ్రాశాను)

◆ ◆ ◆

*రచనాకాలం : 1932,*

*ప్రచురణ : (చుక్కమ్మకథలు), దేశీప్రచురణలు, 1957*